'పది'లో సత్తాచాటారు

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. మెరుగైన మార్కులతో రాణించారు. శనివారం ఉదయం ఫలితాలు విడుదలైన వెంటనే పిల్లలు తమ మార్కులు తెలుసుకోవడానికి ఆసక్తి చూపారు.

- టెన్త్ పరీక్ష ఫలితాల్లో సత్తాచాటిన విద్యార్థులు
- రాణించిన గ్రామీణ పిల్లలు

సంతొబొమ్మాళిలో 83 శాతం

సంతబొమ్మాళి: మండలంలో 83 శాతం ఉత్తీర్ణత నమోదైనట్టు అధికారులు తెలిపారు. సంతబొమ్మాళి ఉన్నత పాఠశాలలో 70.83, నౌపడలో 82.14, దండుగోపాలపురంలో 88.16, బోరుభద్రలో 84.67, పాత మేఘవరంలో 87.04, కొల్లిపాడులో 94.87, వల్లేవలసలో 100, జగన్నాథపురంలో 85.71, వడ్డివాడలో 94.12, కసూర్బాగాంధీ స్కూల్‌లో 64.86, ఎంజేపీ స్కూల్‌లో శతశాతం ఉత్తీర్ణత నమోదైనట్టు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 742 మంది పరీక్షలు రాయగా 616 మంది పాసవ్వగా.. 126 మంది తప్పారు.

మందసలో 86.63 శాతం

మందస: మండలంలోని 24 పాఠశాలల నుంచి 980 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవ్వగా వీరిలో 849 మంది (86.63 శాతం) ఉత్తీర్ణులయ్యారు. గిరిజన ఆశ్రమాలైన బుడంబో, కిల్లోయి, మందస, కృష్ణాపురం జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూలు శతశాతం ఫలితాలను సాధించాయి. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి, ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

వజ్రపుకొత్తూరులో 92 శాతం

వజ్రపుకొత్తూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు 92 శాతం ఉత్తీర్ణత సాధించాయి. 17 ఉన్నత పాఠశాలల నుంచి 703 మంది పరీక్షలు రాయగా 648 మంది పాసైనట్టు (92 శాతం) ఎంఈవో డి.తులసీరావు తెలిపారు. ఒంకులూరు ఉన్నత పాఠశాల నుంచి కొండప్ప ఇందు, డోకులపాడు ఉన్నత పాఠశాలకు చెందిన జి.దుర్గాప్రసాద్, అక్కుపల్లి బీసీ వెల్ఫేర్ పాఠశాలలో చదివిన ఎన్.బాలవర్ధన్, గోవిందపురం ఉన్నత పాఠశాలలో చదివిన డొక్కరి హర్షవర్ధన్ మంచి ఫలితాలు సాధించారు.

టెక్కలిలో 94 శాతం

టెక్కలి: టెక్కలి మండలంలో 94 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. మొత్తం 21 పాఠశాలలనుంచి 1044 మంది పరీక్షకు హాజరవ్వగా 947 మంది పాసయ్యారు. 97 మంది పరీక్ష తప్పారు.

ఇచ్ఛాపురంలో 70.7 శాతం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలో 70.7 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో కురమాన అప్పారావు తెలిపారు. 1220 మంది పరీక్షకు హాజరవ్వగా 862 మంది ఉత్తీర్ణులయ్యారు.44 మంది పరీక్ష తప్పారు.

కవిటిలో 76.92 శాతం

కవిటి: కవిటి మండలంలో 76.92 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 1006 మంది పరీక్షలు రాయగా 789 మంది ఉత్తీర్ణులవ్వగా.. 221 మంది ఫెయిలయ్యారు. పెద్దమెళియాపుట్టుగ స్కూల్ శతశాతం ఉత్తీర్ణత సాధించింది

కాశీబుగ్గ మున్సిపాలిటీలో..

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఉన్నత పాఠశాల నుంచి 260 మంది పరీక్ష రాయగా 194 మంది ఉత్తీర్ణత సాధించారు. పలాస ఉన్నత పాఠశాల నుంచి 218 మందికి 140 మంది పాసయ్యారు. పలాస మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో 23 మందికి 21 మంది పాసయ్యారు.

పలాసలో 84.84

పలాస: పలాస మండలంలో 84.84 ఉత్తీర్ణత నమోదైంది. 1557 మంది పరీక్ష రాయగా 1321 మంది పాసయ్యారు. బొడ్డపాడు పాఠశాల నుంచి 56 మంది పరీక్షలు రాయగా 52 మంది పాసయ్యారు. రంగోయి నుంచి 66 మంది పరీక్షలు రాయగా 60 మంది ఉత్తీర్ణులయ్యారు. రెంటికోట నుంచి 41 మంది పరీక్ష రాయగా ఇందులో 35 మంది ఉత్తీర్ణులయ్యారు. బ్రాహ్మణతర్లా నుంచి 104 మంది పరీక్ష రాయగా 83 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో..

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీని మూడు మున్సిపల్ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వోన్నత పాఠశాల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల నుంచి 668 మంది పరీక్షలు రాయగా 458 మంది (65.5 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులను ఎంఈవో కె.అప్పారావు, పాఠశాల హెచ్‌ఎం లత, ఒకటో వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్ అభినందించారు..

కంచిలిలో 76 శాతం

కంచిలి: మండలంలోని తొమ్మిది జెడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్‌స్కూల్, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూళ్ల నుంచి 703 మంది పరీక్షలు రాయగా, ఇందులో 534 (76 శాతం) మంది ఉత్తీర్ణులైనట్టు ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్ తెలిపారు.

కోటబొమ్మాళి: స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మండల వ్యాప్తంగా 816 మంది పరీక్షలకు హాజరవ్వగా 772 మంది పాసవ్వగా..44 మంది ఉత్తీర్ణులు కాలేదు.

నందిగాం మండడంలో..

టెక్కలి రూరల్: నందిగాం మండలంలోని 14 ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత, గురుకులాలు, కేజీబీవీ, రెండు ఆశ్రమ పాఠశాలల నుంచి 593 మంది పరీక్షలు రాయగా 533 మంది ఉతీర్ణత సాధించారు.

క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: నౌపడలో ఎఫ్‌సీసీ ఆధ్వర్యంలో బొంగు రాజారెడ్డి స్మారక క్రికెట్ జిల్లా టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. 40 జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్టు నిర్వాహకులు బొంగు హర్ష, హర్షితలు తెలిపారు. మొదటి రోజు మూలపేట, నీరపువాని పేట జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మూలపేట జట్టు 109 పరుగులు చేయగా తరువాత బ్యాటింగ్‌కు దిగిన సీరపువానిపేట జట్టు 79 పరుగులు మాత్రమే చేసింది.

సకాలంలో నాడు-నేడు ఫేజ్-2 పనులు

టెక్కలి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న నాడు-నేడు పథకం ఫేజ్-2 పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎంఈవో డి.నాగభూషణరావు అన్నారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండో విడతలో మండల వ్యాప్తంగా 36 పనులు జరుగుతున్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ మూడో తేదీలోగా పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో వెలుగు ఏపీఎం జి.నారాయణరావు, ఆర్‌ఎంఎస్‌ఏ ఇంజినీర్ కె.నగేష్, పలువురు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పదిలో మెరిసిన సాయివినీత్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న సాయివినీత్ విద్యా సంస్థల డైరెక్టర్లు లీల, కోదండరావు

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఉద్దానం ప్రాంత విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి భలా అనిపించుకున్నారు. పూండిలో ప్రముఖ విద్యా సంస్థలైన సాయివినీత్ పాఠశాలకు చెందిన కోరాడ సాయిలిఖిత, కణితి జాహ్నవి ప్రతిభ కనబరచినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది.. విద్యార్థులను విద్యా సంస్థల డైరెక్టర్లు డాక్టర్ చాపర కోదండరావు, డాక్టర్ కె.లీల, ప్రిన్సిపాల్ ఎ.కైలాషరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

పది ఫలితాల్లో సత్తాచాటిన 'వినాయక విద్యానికేతన్'



పి.సుమన్‌కి మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఇచ్ఛాపురం: పదో తరగతి ఫలితాల్లో రత్తకన్నకు చెందిన వినాయక విద్యా నికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. పాఠశాలకు చెందిన పి.సుమన్‌తో పాటు మరో 12 మంది ప్రతిభ కనబరచినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు అభినందనలు తెలియజేశారు.

నరసింహస్వామిని దర్శించుకున్న జెడ్పీ చైర్‌పర్సన్



స్వామివారికి పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ విజయ తదితరులు

కవిటి: బల్లిపుట్టుగలోని లక్ష్మీనరసింహస్వామి వారిని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసింహసుదర్శన యాగం వేడుకల్లో భాగంగా స్వామికి విశేష కార్యక్రమాలు జరిగాయి. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

చోరీపై విచారణ

ఇచ్ఛాపురం: పట్టణంలోని డబ్బూరి వీధికి చెందిన పల్లంటి చిరంజీవి ఇంట్లో శుక్రవారం రాత్రి జరిగిన చోరీలో ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు పోయినట్టు ఫిర్యాదు అందిందని పట్టణ ఎస్సై కె.గోవిందరావు తెలిపారు. దీనిపై విచారణ ప్రారంభించామన్నారు. చోరీ జరిగిన ఇంటిని క్లూస్ టీమ్ సిబ్బంది శనివారం పరిశీలించి వివరాలు సేకరించారు. పల్లంటి నీలవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామన్నారు.

డీసీసీబీ ద్వారా జన సురక్ష పథకాలు



బీమా పథకాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

టెక్కలి: రైతులు, వ్యాపార వర్గాలకు ఉత్తమ సేవలు అందజేస్తున్న డీసీసీబీ ద్వారా జన సురక్ష పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి బ్రాంచ్ మేనేజర్ ఐ.సీతారాం కోరారు. శనివారం టెక్కలి మండలం నరసింగపల్లి పంచాయతీ జగన్నాథపురం గ్రామంలో రైతులకు, ఇతర వర్గాల వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన, కిసాన్ క్రెడిట్ ద్వారా ఆవులు, గేదెల కోసం రుణాలు మంజూరు పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మెండ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఏపీవో ఔదార్యం



సురేఖకు నగదు అందజేస్తున్న శ్రీనివాసరావు

ఇచ్ఛాపురం రూరల్: ఉద్యోగంలో చేరి శనివారం నాటికి 20 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వృద్ధురాలికి ప్రతీ నెల వెయ్యి రూపాయల ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు వచ్చారు ఇచ్ఛాపురం ఏపీవో పి.శ్రీనివాసరావు. తాను తొలిసారిగా వెలుగు సీసీగా ఉద్యోగంలో చేరిన వజ్రపుకొత్తూరు మండలంలోని బొడ్డపాడు పంచాయతీని ఎన్నుకున్న శ్రీనివాసరావు ఆ మొత్తాన్ని ప్రముఖ విప్లవ గేయకవి, జముకుల పాటకు ఆరాధ్యుడు సుబ్బారావు పాణిగ్రాహి భార్య సురేఖ పాణిగ్రాహికు శనివారం అందజేశారు. ఇక నుంచి ప్రతి నెల వెయ్యి రూపాయలను ఆమెకు అందజేస్తానని తెలిపారు.

జనరంజక పాలన

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ
- సోంపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమాన్ని వివరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

సోంపేట: రాష్ట్రంలో జనరంజక పాలన నడుస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సోంపేట మేజర్ పంచాయతీ రెండో సచివాలయం పరిధిలో 'గడప గపవకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కుటుంబాల వారీగా చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రికి ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ నగిరి ప్రభావతి, ఉపసర్పంచ్ వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు పొడుగు కామేష్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీనాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువ టూరిజం క్లబ్ ఏర్పాటు



యువ టూరిజం క్లబ్ విద్యార్థినులతో జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాలో ఎన్నో ఆకర్షణీయ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని జిల్లా పర్యాటక అధికారి ఎస్.నారాయణరావు అన్నారు. శ్రీకాకుళంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం యువ టూరిజం క్లబ్ ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శివశంకర్, టూరిజం కౌన్సిల్ సభ్యులు డాక్టర్ యార్లగడ్డ గీతా శ్రీకాంత్, సెట్‌శ్రీ సీఈఓ ఎల్.నాయుడు, అప్పలనాయుడు, సంతోష్ దూసి, శ్రీనివాసులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సత్యసాయి మందిరాల్లో ఈశ్వరాంబ వర్ధంతి



రామాచార్యులను సన్మానిస్తున్న మందిర ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: సత్య సాయిబాబా మాతృమూర్తి ఈశ్వరాంబ వర్ధంతి సందర్భంగా సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం పెద్ద మందిరం, బ్యాంకర్స్ కాలనీ సాయి బృందావనంలో బాలవికాస్, పలు సాంస్కృతి కార్యక్రమాలు జరిగాయి. రామాచార్యులచే పెద్దమందిరంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, మృత్యుంజయ మంత్ర హోమం వైభవంగా నిర్వహించారు. అనంతరం రామాచార్యులను సన్మానించారు. కార్యక్రమాల్లో జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ శ్రీ సూర రామచంద్రరావు, మందిర కన్వీనర్ కంబ మురళీకృష్ణ, మండవల్లి రవి, డోకి జనార్దనరావు, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన పోలీసు సిబ్బంది



నాగేశ్వరరెడ్డిని కలిసిన సీఐలు

కాశీబుగ్గ: కాశీబుగ్గ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన జి.నాగేశ్వరరెడ్డిని డివిజన్ పరిధిలోని సీఐలు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛాలు అందజేశారు. డీఎస్పీని కలిసిన వారిలో కాశీబుగ్గ సీఐ గుగ్గిలాపు శ్రీనివాసరావుతో పాటు నరసన్నపేట, ఇచ్ఛాపురం, సోంపేట, టెక్కలి సీఐలు ఉన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు తీరప్రాంతంలోని లక్ష్మీపురం, శివకృష్ణాపురం మత్స్యకార గ్రామాలకు మంచినీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని సర్పంచ్ బుడ్డ కల్యాణ్ ముఖలింగం చెప్పారు. శనివారం ట్యాంకు ద్వారా మంచినీటిని అందజేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిమెంట్ బల్లలు ఏర్పాటు



ఏర్పాటు చేసిన బల్లలు

కంచిలి: మండల పరిషత్ నిధులు రూ. 50 వేలతో జాడుపూడి గ్రామ ప్రవేశ ద్వారం వద్ద పది ప్రజా విశ్రాంతి బల్లలను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు పలికల జయరాం పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: స్థానిక ఐకేపీ కార్యాలయంలో గ్రామైక్య సంఘ సభ్యులకు, సీసీలకు ఆర్థిక అక్షరాస్యతపై శనివారం అవగాహన కల్పించారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ బి.బలరాం ఆర్థిక ప్రణాళికలు, ఆర్థిక మోసాలపై వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం కె.రాము, ఎంఎంఎస్ అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వికాసంతో అభ్యుదయభావాలు



కృష్ణారావును సత్కరిస్తున్న దృశ్యం

కవిటి: సంగీత సాహిత్యాలతో కూడిన ఆధ్యాత్మిక వికాసంతో మనుషుల్లో అభ్యుదయ భావాలు అలవడతాయని సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. లోళ్లపుట్టుగలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి కళాపీఠంలో తాళ్లపాక అన్నమాచార్య 615వ జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన సంగీత గాత్రకచేరీలు ఆహూతులను అలరించాయి. అంతకుముందు అన్నమాచార్య చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, కళాకారులు లోళ్ల జయరాం, కల్యాణిగ్రూప్ సంస్థల అధినేత లోళ్ల రాజేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉద్దానానికి చెందిన ప్రముఖ మృదంగ కళాకారులు బొంతల కోటి కృష్ణారావును ఉద్దానానికి చెందిన కళాకారులు, శిష్యబృందం ఘనంగా సత్కరించింది. కార్యక్రమంలో పొందల కృష్ణారావు, పండి దేవేంద్రమూర్తి, ఎన్ని దేవరాజు, పూడి వెంకటేశం పాల్గొన్నారు.

పక్కాగా అభివృద్ధి ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

కవిటి: గ్రామపంచాయతీ వార్షిక అభివృద్ధి ప్రణాళికను పక్కాగా సిద్ధం చేసే దిశగా పంచాయతీ కార్యదర్శులంతా సమాయత్తం కావాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను సిద్ధం చేసేందుకు అవసరమైన విధివిధానాలను సూచించారు. సాధ్యమైనంత త్వరలో ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో నివేదికలు సిద్ధం చేయాలన్నారు.

పద్మావతికి నటగాన మంజరి బిరుదు



కె.వి.పద్మావతి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ప్రముఖ పౌరాణిక నాటక కళాకారిణి కె.వి.పద్మావతికి శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో నటగాన మంజరి బిరుదును ప్రదానం చేశారు. శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిరంలో శనివారం శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో 283వ నెలవారీ సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య ఆర్థిక సలహాదారు బి.ఎ.మోహనరావు, స్నేహితుల సౌజన్యంతో అరకిలో వెండితో తయారు చేసిన రజిత మకుటాన్ని పద్మావతికి బహూకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి మాట్లాడుతూ పౌరాణిక కళాకారిణిగా రాణించడం గొప్ప విషయమన్నారు. అనంతరం ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం, కురుక్షత్రం(పాండవసీను), గయోపాఖ్యానం(యుద్ధసీను), సత్యహరిశ్చంద్ర(వారణాసి సీను నుంచి) ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రంగస్థల కళాకారుల సమాఖ్య ప్రతినిధులు రామలింగస్వామి, పన్నాల నరసింహమూర్తి, రామచంద్రదేవ్, చిట్టి వెంకటరావు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ యంత్రం ప్రారంభం



సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం కల్చరల్: ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. ప్రపంచ తలసేమియా నివారణ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ బ్లడ్ బ్యాంకు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ యంత్రాన్ని ఆవిష్కరించి జిల్లా వాసులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌క్రాస్ సేవల్లో శ్రీకాకుళం జిల్లాకు మొదటి స్థానం రావడం ఆనందంగా ఉందన్నారు. సింగిల్ డోనర్ అందించిన ప్లేట్ లెట్లు అతి తక్కువ సమయంలో రోగులకు అందచేయనున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, వైస్ చైర్మన్ డాక్టర్ పి.సుధీర్‌వారి బృందం సభ్యులు, వలంటీర్లు అన్ని మండలాల్లో వలంటీర్ల సహకారంతో మరిన్ని సేవలు అందించాలని కోరారు. ఇచ్ఛాపురం ఉద్దానం ప్రాంతంలో ఐఆర్‌సీఎస్ బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ జిల్లాకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8న కలెక్టర్‌కు సన్మానిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తల సేమియా బాధితులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అనూరాధ, డాక్టర్ కె.సుధీర్, డీపీఆర్‌ఓ కె.బాలమాన్‌సింగ్, డాక్టర్ నిక్కు అప్పన్న, ఏపీఎం ఎస్‌ఐడీసీ ఈఈ బి.ఎన్.ప్రసాద్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్య, సతీష్, రక్తదాతలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించరేం?



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న సర్పంచులు, ఎంపీటీసీలు

జి.సిగడాం : సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారుల్లో చలనం రావడం లేదని, బిల్లుల చెల్లింపులో అలసత్వం వహిస్తున్నారని, అంగన్‌వాడీ భవనాలు లేక చిన్నారులు, కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని, వీధికుక్కలను తక్షణమే నిర్మూలలించాలని నాగులవలస, పాలఖండ్యాం సర్పంచులు బత్తుల స్వాతి, దారబోయిన రెయిమ్మ, బగాది అప్పలనాయుడు, అల్లు జోగినాయుడు, మహదాస్య చిన్నారావు, తిరుమరెడ్డి వెంకటరావు నిలదీశారు. శనివారం జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు నేతృత్వంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి, తోలేటి వెంకటరావు, మక్క శ్రీలత, గేదెల వరలక్ష్మి, తిరుమరెడ్డి విజయలక్ష్మి, బూటు దమయంతి, కుదిరెళ్ల సూజాత, వడిశ మహేశ్వరావు, కంది రమాదేవి, తొత్తడి రామారావు, బూరాడ శ్రీదేవి, వ్యవసాయాధికారి వై.శారద, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యులు కాయల రమణ, తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, వైద్యులు యశ్వంత్, యు.సుమన్, సీడీపీఓ డోల పాపినాయుడు, ఏఈఈలు ఎం.రమేష్, బగాది భాగ్యలక్ష్మి, కె.తిరుపతిరావు, ఎంఈఓ అరసాడ రవి పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు



సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. పోలీసులు, ఆర్టీసీ సంయుక్త సౌజన్యంతో శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను డీపీటీఓ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ పరిసరాల్లో మొబైల్ ఫోన్ల దొంగతనాలు, పిక్‌పాకెట్లు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుచున్నాయని, వీటి పరిశీలనకు నిఘా కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ఉన్నవి పాడైపోవడంతో కొత్త కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం 1, 2 డిపో మేనేజర్లు కె.మాధవ్, కె.ఎస్.ఆర్.శర్మ, అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, ఇన్‌చార్జ్ బస్ స్టేషన్ మేనేజర్ ఎల్‌ఎస్ నాయుడు, ఎంపీ రావు, ఎం.హాటకేశం, కె.సుమన్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి చల్లయ్యమ్మ అగ్రహారం పాఠశాల సమస్య



మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందజేసిన నాయకులు

లావేరు: మండలంలోని మురపాక పంచాయతీ చల్లయ్యమ్మ అగ్రహారం పాఠశాల సమస్యపై వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ మాజీ మండల కన్వీనర్ లుకలాపు అప్పలనాయుడు, నాయకుడు తేనేల సురేష్‌కుమార్, కొత్తకోట మాజీ సర్పంచ్ శివాంగం నాగరాజు తదితరులు శనివారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను విజయవాడలో అతని కార్యాలయంలో కలిశారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని, వెంటనే భవనాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. మంత్రి వెంటనే స్పందించి పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారని అప్పలనాయుడు తెలిపారు. వారితో పాటు నాయకులు పతివాడ గురునాయుడు, వాసు ఉన్నారు.